క్లుప్తంగా

గాబు సంబరానికి రాట ముహూర్తం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడిలోని గంగాలమ్మ గాబు సంబరానికి బుధవారం రాట ముహూర్తం చేశారు. స్థానిక ఎలిమెంటరీ స్కూల్‌కు సమీపంలో వేంచేసిన గంగాలమ్మతల్లి ఆలయం వద్ద గింజాల కుటుంబ సభ్యులు పసుపుకొట్టి, పందిరి రాట వేశారు. ఈ నెల 10న గాబు సంబరం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి మూడేళ్లకు ఒక్కసారి నిర్వహించే గాబు సంబరాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు.

రిటైర్డ్ ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావుకు సత్కారం



ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

గోకవరం: స్థానిక ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు ఉద్యోగ విరమణ సభ బుధవారం ఘనంగా జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గోవిందు ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు దంపతులతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు రాజేశ్వరరావు దంపతులను శాలువా, పూలమాలలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానం ఉద్యోగ సంఘ అధ్యక్షుడిగా విష్ణు



అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఉద్యోగ సంఘ అధ్యక్షుడిగా గంటా విష్ణు బుధవారం ఎన్నికయ్యారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా పని చేసిన బీఎస్ఎన్ రోజు పదవికాలం మరో ఏడాది ఉన్నప్పటికీ ఆయన తన పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల అధికారిగా సూపరింటిండెంట్ బలువు సత్య శ్రీనివాస్ వ్యవహరించారు. గంటా విష్ణును పలువురు దేవస్థానం ఉద్యోగులు అభినందించారు.

పాస్టర్ మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

జగ్గంపేట: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు జగ్గంపేట శివారు రంగవల్లినగర్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, పీఓడబ్ల్యూ తదితర ప్రజా సంఘాలు నేతలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, నేతలు కొండదుర్గారావు, వల్లూరి రాజబాబు, కుంచే అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత పాలిసెట్ ఆన్‌లైన్ శిక్షణ తరగతులు గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో వివిధ బ్రాంచ్‌ల్లో ప్రవేశం కోసం రాష్ట్ర సాంకేతిక విద్యామండలి నిర్వహించే పాలిసెట్–2025 ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ ఉచిత ఆన్ లైన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 84890 53404, 95055 18249, 76610 42854 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన

కోటనందూరు: చర్చిల్లో భద్రతను మెరుగు పరిచేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని స్థానిక ఎస్సై టి.రామకృష్ణ సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్లో బుధవారం చర్చి పాస్టర్లకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో చర్చిల భద్రత మెరుగుపడుతుందన్నారు. నేరాల కట్టడిలో సీసీ కెమెరాలు ముఖ్య భూమిక పోషిస్తాయన్నారు. పాస్టర్ల సంఘ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, కార్యదర్శి రాజు, పాస్టర్లు గాబ్రియేల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సప్తాహాలు

కిర్లంపూడి: జగపతినగరంలోని కొండయ్యపేట, చిల్లంగి రామాలయాల్లో నిర్వహిస్తున్న సప్తాహాలు మూడో రోజు బుధవారం కొనసాగాయి. స్థానిక, పరిసర గ్రామాల నుంచి భజన బృందాలు తరలివచ్చి భక్తి గీతాలు ఆలపిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా రామాలయాల్లోని సప్తాహ నిర్వాహక సభ్యులు మాట్లాడుతూ 7 రోజుల పాటు నిరంతరంగా భక్తి గీతాలతో భజనలు చేస్తామన్నారు. సప్తాహం ముగింపు రోజున భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

అక్రమాలకు ఉపాధి

- అవినీతికి అడ్డాగా ఉపాధిహామీ పథకం
- అండగా నిలుస్తున్న అనధికార ఫీల్డ్ అసిస్టెంట్లు
- పనుల్లో కూటమి నాయకులు, వారి అనుచరగణానికి పెద్దపీట



సంగవాకలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కోటనందూరు: అధికారం చేపట్టిందే తడవుగా కూటమి నాయకులు అక్రమాలకు తెర లేపారు. అందుబాటులో ఉన్న అన్ని అడ్డదారులను తొక్కుతూ ఆధిపత్యం చెలాయించి జేబులు నింపుకుంటున్నారు. దీనిలో భాగంగానే ఉపాధి పనులపై కన్నేశారు. ఉపాధి హామీ పథకాన్ని తమ సొంత పథకంగా మార్చేసుకున్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి అనధికారికంగా కొత్త ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించుకున్నారు. పాతవారిని పక్కన పెట్టుకునే కొత్తవారితో తమ అనుకూల ప్రాంతాలు, వ్యవసాయ మకాలు వద్ద పనులు చేయించుకోవడంతో పాటు అనుచర గణానికి మస్తర్లు వేయించుకునే దుస్థితికి పథకాన్ని దిగజార్చారు. ఈ దుస్థితికి జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ అధికారులంతా వత్తాసు పలకడం గమనార్హం. కూటమి నేతల ఒత్తిళ్లతో ఉపాధి పనులపై పర్యవేక్షణ కొరవడగా నిజమైన కూలీలకు అన్యాయం జరుగుతోంది. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులపై దృష్టి సారించి ఉపాధి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కూలీలు విజ్ఞప్తి చేస్తున్నారు.

40 వేల జాబ్‌కార్డులు

తుని నియోజకవర్గంలో సుమారుగా 40 వేల జాబ్ కార్డులు ఉండగా 29 వేల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తుంటారు. నిబంధనల ప్రకారం పనులు చేయాలనుకున్న కూలీల నుంచి వారం ముందుగా డిమాండు తీసుకొని పనులు చేయించాలి. పనులు చేసిన కూలీల మస్తర్‌షీట్లపై ఫీల్డ్ అసిస్టెంట్లతో సంతకాలు చేయించి కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేస్తే వేతనాలు కూలీల బ్యాంకు ఖాతాకు జమ అవుతాయి. కాగా ఉపాధి కార్యాలయమంతా ప్రస్తుతం గందరగోళంలో కొట్టుమిట్టాడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగుతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు సంతకాలు చేయాల్సిన మస్తర్‌షీట్లపై టెక్నికల్ అసిస్టెంట్లతో సంతకాలు చేయించి మస్తర్‌షీట్లు అప్‌లోడ్ చేస్తున్నారు. మొత్తంగా ఉపాధి హామీ పథకంలో ఏమి జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

నిజమైన కూలీలకు మొండి చేయి

కూటమి నేతల హడావిడితో పల్లెల్లో నిజమైన ఉపాధి కూలీలకు మొండి చేయి చూపిస్తున్నారు. కేవలం ఆ కూలి డబ్బులపైనే ఆధారపడి బతికే వారికి పనులు చెప్పకుండా కూటమి కార్యకర్తలు, వారికి సంబంధించిన కూలీలు, అనుచరులకు మాత్రమే పనులు కల్పిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధిపనుల ప్రాంతంలో ఏమి జరుగుంతుందో తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేని నిస్సహాయస్థితిలో ఉపాధి అధికారులు ఉండడం గమనార్హం.

అధికార పార్టీ వారికే పనులు



పల్లెల్లో ఉపాధి పనులు జరుగుతున్న తీరు చాలా దారుణంగా ఉంది. నిజమైన కూలీలకు పనులు చెప్పకుండా అధికార పార్టీకి సంబంధించిన వారికే పనులు చెబుతున్నారు. పని అడిగిన కూలీలకు 100 రోజుల పనిదినాలు పూర్తి కాకపోయినా, పూర్తయిపోయాయనే సాకులు చెబుతున్నారు. పైగా కూటమి నాయకులకు సంబంధించిన ప్రాంతాల్లోనే పనులు చేస్తున్నారు. ఉపాధి పనుల్లో ఎన్నో అన్యాయాలు జరుగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయం. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు.

– జిగటాల వీరబాబు, సర్పంచ్, భీమవరపుకోట

అధికారులు బలిపశువులు

అధికారాన్ని అడ్డంపెట్టుకుని కూటమినేతలు ఆడుతున్న వికృత క్రీడలో ఉపాధి అధికారులు బలిపశులు అవుతున్నారు. వారికి స్వేచ్ఛగా ఉద్యోగం చేసే పరిస్థితి లేకుండా పోయింది. పాత ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించకుండానే కూటమి నేతల ఒత్తిళ్లతో నియమించిన కొత్తవారితో పనులు చేయించాల్సిన దుస్థితి. అలా చేయించడం వల్ల మొబైల్ పర్యవేక్షణ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరుల తనిఖీల రూపంలో ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితి ఉంది. కూటమి దుశ్చర్యలతో ఎవరికి ఎలాంటి సమాధానం చెప్పాలో అర్థం కాని పరిస్థితి. ఈ నేపథ్యంలో ముందు నుయ్యి..వెనుక గొయ్యి అన్న చందంగా మారింది ఉపాధి అధికారులు విధి నిర్వహణ.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

రౌతులపూడి: గర్భిణులు ఆరోగ్యకరమైన పౌష్టికాహారంతో పాటు ఎప్పటికప్పుడు ఆరోగ్య నియమాలు పాటించడం ద్వారా సహజ ప్రసవం జరుగుతుందని సీహెచ్‌సీ వైద్యాధికారి జానకీదేవి అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో బుధవారం గర్భిణులు ఆరోగ్యపరంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భం దాల్చిన మహిళలు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవటమే కాకుండా క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యులు సూచనల మేరకు మంచి పోషక విలువలు కలగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకూ సీజేరియన్ లేకుండా సహజ ప్రసవం జరిగేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

జగ్గంపేట: మండలం కాట్రావులపల్లిలో వరి పొలాలను బుధవారం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం పంటను కాండం తొలిచే పురుగు ఆశించినట్టు గుర్తించారు. దీని నివారణకు రైతులు తక్షణమే చర్యలు చేపట్టాలని పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీతారామశర్మ సూచించారు. జగ్గంపేట మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్, పెద్దాపురం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సుజాత, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

తుని: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల నూతన కమిటీలను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తుని మున్సిపాలిటీ ఉపాధ్యక్షులుగా కొప్పర్తి రాజా, మీలా బుజ్జి, ప్రధాన కార్యదర్శులుగా కోలా శివ, త్యాడి శంకరరావు, పిల్యాణం సూకరాజు, చుక్కా ప్రసాద్, కార్యదర్శులుగా కొంగ్ర వెంకట్రావు, సీహెచ్ జోగారావు, యరమిల్లి వాసు, రొంగల మల్లేష్, దాసరి శ్రీనులను నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పిల్లి నరసింహారావు, శిల్పరశెట్టి జగన్మోహన్, కాకాడ శివ, ఎస్‌కే జిలానీ, చెల్లుబోయిన ముసలయ్య, మొక్కన పరమేష్, బోడపాటి సుబ్రహ్మణ్యం, పాకలపాటి కృష్ణంరాజు, చిడం భాస్కరరావు, వి.నాని, శివ భాస్కరరావు, రొంగల ఏసు నియమితులయ్యారు.

తుని మండల కమిటీ

వైఎస్సార్ సీపీ తుని మండల ఉపాధ్యక్షులుగా కుర్రా సీతారామస్వామి, అత్తి నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా వంగలపూడి జమీల్, అంకంరెడ్డి వరహాలబాబు, కిల్లాడ గోవిందు, జువ్వల సూరిబాబు, కార్యదర్శులుగా చింతంనీడి కృష్ణ, వంగలపూడి గంగ, లంక చిటుకులు, తర్రా శ్రీధర్, డొంక సత్యనారాయణలను నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మామిడి దుర్గా ప్రసాద్, ఎం.పెద్దిరాజు, ఎం.శ్రీను, బొట్టా వరహాలబాబు, బి.లోవరాజు, పసగడుగుల నాగేశ్వరరావు, గోసుల కృష్ణ, బర్రే కృష్ణ, టి.శ్రీను, గొర్లి సూకరాజు, ఆర్.సూరిబాబు, దాడి గోవిందు నియమితులయ్యారు.

తొండంగి మండలం

వైస్సార్ సీపీ తొండంగి మండల ఉపాధ్యక్షులుగా మేడిశెట్టి ధారబాబు, బూర్తి విజయకుమార్, ప్రధాన కార్యదర్శులుగా బస్సా గంగాధర్, పారేపల్లి సురేష్, యనమల పంపా ప్రవీణ్, బూసాల వెంకటరమణ, యజ్జల సత్యనారాయణ, అంబుజాలపు సత్యనారాయణ, మాకినీడి వీర రాఘవరం, యడ్ల కృష్ణ, ధారా చిన అప్పారావు నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బత్తిన విజయ, సూరిశెట్టి వెంకట రామకృష్ణ, కోడూరు అప్పారావు, కె.శ్రీనివాస్, కె.రంగారావు, నేమాల గోవిందు, అంబుజాలపు గోపి, కొండా బాబ్జి, గోసల కిశోర్, డి.అప్పారావు, వాసంశెట్టి సత్యనారాయణ, అంబుజాలపు నాగేంద్ర నియమితులయ్యారు.

కోనటందూరు మండలం

కోటనందూరు మండలం పార్టీ ఉపాధ్యక్షులుగా అనుకూల రిచర్డ్ శ్యామ్యూల్, కుంచె అచ్చిరాజు, ప్రధాన కార్యదర్శులుగా నెమ్మాది రాజబాబు, అన్నెంరెడ్డి దుర్గా ప్రసాద్, యు.దుర్గా శ్రీనివాస్, కరక నాగేశ్వరరావు, కార్యదర్శులుగా అన్నెంరెడ్డి సత్యనారాయణ, లెక్కల నాగేశ్వరరావు, దేవవరపు శ్రీను, యడ్ల నాగ సత్తిబాబులను నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చిట్టిమూరి బుల్లికొండ, యు.సత్యనారాయణ, ఎలేటి బాలకృష్ణ, పైలా లవకుశ, కిల్లాడ రాజబాబు, లగుడు ముగిరాజు, జే.నాగేశ్వరరావు, అన్నెంరెడ్డి సత్తిబాబు, సుర్ల నాగ రమణ, బి.ఆఖిల్, చిటికెల వెంకటరమణ, ఎ.సురేష్ నియమితులయ్యారు.

విజయానికి గ్రామ కమిటీలే కీలకం

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ నరసింహం
- జగ్గంపేటలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి గ్రామ కమిటీలే కీలకమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. స్థానిక బాలాజీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గస్థాయి పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ పార్టీ అధ్యక్షుల ఎంపికలను వేగవంతంగా చేయాలన్నారు. స్థానిక నేతలు సమన్వయంతో సమర్థులైన వారిని గ్రామ కమిటీలుగా ఎన్నుకోవాలని సూచించారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోతోంది

కూటమి నేతలు సూపర్ సిక్స్ అంటూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి, ప్రస్తుతం వాటిని అమలు చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందన్నారు. వారు ఇచ్చిన హామీలే వారికి శాపంగా మారతాయన్నారు. ఏ ఒక్క హామీ నెరవేర్చలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. మెగా డీఎస్సీ అని హడావుడి చేసిన కూటమి ప్రభుత్వం కనీసం పవర్ స్టార్ డీఎస్సీ కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.

ఎన్నికలు వస్తే జగన్ గెలుపు ఖాయం

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీ ప్రభంజనం, జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. తాను దేశంలోని పలు రాష్ట్రాల్లో తిరిగానని, జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసినట్లు నవరత్నాలు తరహా పథకాలను పారదర్శకంగా ఏ రాష్ట్రంలోని అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో యువనేత తోట రాంజీ, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, గండేపల్లి, గోకవరం, కిర్లంపూడి, జగ్గంపేట మండలాల పార్టీ అధ్యక్షులు మద్దిపట్ల రామకృష్ణ, పాటి రాంబాబు, పెనగంటి సతీష్, రావుల గణేష్ రాజా, లీగల్ సెల్ అధ్యక్షులు గుల్లా ఏడుకొండలు, వాణిజ్య విభాగం నియోజకవర్గ నేత కరుటూరి వీర్రాజు, రామకుర్తి మూర్తి, కాపారపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులకు అండగా ఉంటా

ముద్రగడ గిరిబాబు



కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

కిర్లంపూడి: ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానని పార్టీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. రౌతులపూడి మండలం ఎస్.పైడిపాలలో ఇటీవల రెండు పార్టీ వర్గాల మధ్య జరిగిన తగాదాల్లో పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. దీంతో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం నివాసంలో బుధవారం ముద్రగడ గిరిబాబును కలిసి జరిగిన సంఘటన ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై గిరిబాబు మాట్లాడుతూ రాగద్వేషాలకు తావు లేకుండా సమస్యను శాంతియుతంగా పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొల్లు దివాణం, ఎంపీటీసీ రాయిప్రసాద్, గొల్లు వెంకటరమణ, పారేపల్లి శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దొరబాబును పరామర్శించిన ముద్రగడ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాయుడు దొరబాబును వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముద్రగడ గ్రామంలో పర్యటించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కొంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, సొసైటీ మాజీ చైర్మన్లు జువ్వల బాబులు, జువ్వల చిన్నబాబు, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా బాధితులకు ఆరోగ్య కిట్ల పంపిణీ



అల్లిపూడిలో ఫైలేరియా బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న బుల్లిబాబు తదితరులు

కోటనందూరు: మండలంలోని అల్లిపూడిలో ఫైలేరియా బాధితులకు బుధవారం ఆరోగ్య కిట్ల పంపిణీ చేశారు. గ్రామంలోని 17 మంది వ్యాధిగ్రస్తులకు టీడీపీ నాయకుడు అంకంరెడ్డి బుల్లిబాబు ఆధ్వర్యంలో టబ్, టవల్, సోప్, మగ్‌లతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా బుల్లిబాబు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. స్థానిక నాయకులు కొండబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

రౌతులపూడి: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని డీఆర్‌డీఏ పీడీ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏలు, ఎన్యూమరేటర్లకు ఇస్తున్న శిక్షణా తరగతులను బుధవారం ఆయన పర్యవేక్షించారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి మహిళల జీవనోపాధికి అవసరమైన ప్రణాళికను రూపొందించి రుణసదుపాయం కల్పించాలన్నారు. మహిళా సంఘాల్లోని విద్యావంతులను గుర్తించి ఎన్యూమరేటర్లుగా నియమించామన్నారు. ఎన్యూమరేటర్లు వీఓఏలతో కలసి ఇంటింటికీ వెళ్లి మహిళా సంఘాల సభ్యుల జీవనశైలి, వారి ఆర్థిక స్థితిగతులను గుర్తించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. త్వరితగతిన ప్రణాళికలు తయారు చేసి ఈ నెల 7వ తేదీలోగా అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో షేక్ ఏపీడీ జిలానీ, ఎల్‌హెచ్ డీపీఎం కేశవ్, ఎల్‌హెచ్ ఏపీఎం సురేష్, ఏపీఎం నాగమణి, సీసీలు అప్పలకొండ, రతన్‌రాజు, సీత, సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాధుల కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

కోటనందూరు: డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని టీజే నగరంలో బుధవారం జీవనోపాధుల కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. జీవనోపాధుల కేంద్రం ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఏపీఎం సూర్యకుమారి, డ్వాక్రా మహిళలతో చర్చించారు. గ్రామంలో ఓ డ్వాక్రా మహిళ నిర్వహిస్తున్న జీడిపప్పు ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించి నిర్వహణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల మహిళా సమాఖ్యను సందర్శించి అక్కడ సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఐబీ ప్రాజెక్టు మేనేజర్ జిలానీ, డీపీఎం కేశవరావు, ఎఫ్‌పీఓ సీసీ సురేష్, ఏపీఎం సూర్యకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమీలాదేవి సేవలు శ్లాఘనీయం



ప్రమీలాదేవీని సత్కరిస్తున్న వైద్య విధాన పరిషత్ జిల్లా కో ఆర్డినేటర్ స్వప్న తదితరులు

ప్రత్తిపాడు: వైద్య రంగంలో ప్రమీలాదేవీ అందించిన సేవలు శ్లాఘనీయమని పలువురు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు కొనియాడారు. ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మెటర్నిటీ అసిస్టెంట్ కొండెపూడి ప్రమీలాదేవీ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సరయూ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సత్కార సభ ఏర్పాటు చేశారు. 36 ఏళ్ల పాటు వివాద రహితంగా, నిస్వార్థంగా ఆమె అందించిన సేవలను కొనియాడారు. అనంతరం పూలమాల, శాలువా, జ్ఞాపికలతో ఆమెను ఘనంగా సత్కరించారు. యూటీఎఫ్ నాయకుడు గుడాల సుందర్రావు, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిటీ మెంబర్ మైఖేల్ సోనీవుడ్, జిల్లా వైద్య విధాన పరిషత్ కో ఆర్డినేటర్ స్వప్న, ఎంపీపీలు గోళ్ల కాంతి సుధాకర్, గొల్లపల్లి బుజ్జి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, సర్పంచ్ విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు శేరు కృష్ణ, గోళ్ల జయశేఖర్, మాజీ సర్పంచ్‌లు శిరసాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆటిజం దినోత్సవం

ఏలేశ్వరం: పట్టణంలోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆటిజం(రుగ్మత) డే ఘనంగా నిర్వహించారు. భవిత కేంద్రం టీచర్లు వాణిపద్మజ, బుజ్జి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆటిజంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటిజం కలిగిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారి సైగలను అర్థం చేసుకోవడం ద్వారా సమస్యలు తెలుసుకోవచ్చన్నారు. ఆటిజం పిల్లల పట్ల సానుకూలంగా ఉండాలన్నారు. వారిపై చిరాకు, కోప్పడడం మానుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్, ఆటలు, పాటలు, కుర్చీలాట, డాన్స్ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోటనందూరులో...

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈఆర్పీలు నాగగోవిందు, నారాయణరావు పిల్లలకు వచ్చే ఆటిజం లక్షణాలు, ఆటిజం నుంచి పిల్లలను బయటకు తీసుకొచ్చేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిశువు జన్మించాక ఏవైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. ఆటిజం ఉన్నట్లు నిర్ధారణ అయితే డాక్టర్ల సలహా మేరకు మందులు వాడటం, కౌన్సెలింగ్, శిక్షణ ద్వారా మానసిక పరిపక్వత పెంచవచ్చన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ థెరపీ, సైకలాజికల్ కౌన్సెలింగ్, ఫ్యామిలీ కౌన్సిలింగ్‌లతో మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేదాంత మహాసభలు ప్రారంభం



చిద్గగనాంద ఆశ్రమంలో యజ్ఞం చేస్తున్న దంపతులు

ఏలేశ్వరం: సిరిపురం గ్రామంలోని చిద్గగనాంద గీతాశ్రమంలో బుధవారం 51వ భక్తిజ్ఞాన వేదాంత మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయనగరం జిల్లా గంగచోళ్లపెంట జ్ఞానానంద గీతాశ్రమం పీఠాధిపతి యోగానందా భారతీస్వామి ఆధ్వర్యంలో వేదాంత మహాసభలు మూడురోజుల పాటు జరగనున్నాయి. మొదటిరోజు ప్రణవోపాసన, ప్రాతకాల ప్రార్థన, నగర సంకీర్తన, యల్లపు సూర్యనారాయణ తదితరులు పతాకారోహణ, సూర్యనమస్కారాలు నిర్వహించారు. గీతానందా స్వామిజీ జ్యోతిప్రజ్వలన చేశారు. సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు ప్రార్థన చేశారు. అనంతరం గీతాపారాయణ, గీతాయజ్ఞం నిర్వహించారు. విశ్వనందా భారతీస్వామి దివ్యనందా భారతీస్వామి, గీతానందాస్వామితో పాటు పలువురు స్వామీజీలు మహాత్ముల ప్రవచనాలు, భజనలు నిర్వహించారు. అనపర్తి దుర్గాప్రసాద్ దంపతులు, గునిమానికల రమణ దంపతులు, ఆకులనూకపతి రావు దంపతులతో యజ్ఞం చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఏపీఓగా కృష్ణంరాజు



ఎంపీడీఓను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఏపీఓ కృష్ణంరాజు

గండేపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గండేపల్లి మండల ఏపీఓగా ఎం. కృష్ణంరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. జగ్గంపేట ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న కృష్ణంరాజు బదిలీపై గండేపల్లి వచ్చారు. గండేపల్లి ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న గంగాభవాని బదిలీపై గొల్లప్రోలు వెళ్లారు. ఉపాధి సిబ్బంది నూతన ఏపీఓ కృష్ణంరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎంపీడీఓ నాతి బుజ్జిని ఏపీఓ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఈసీ రమేష్, సిబ్బంది ఉన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు సాయం



సమావేశంలో మాట్లాడున్న హౌసింగ్ పీడీ సత్యనారాయణ

ప్రత్తిపాడు: పేదలు గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు గాను అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ (హౌసింగ్ పీడీ) ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, కొండరెడ్లకు రూ.లక్ష అదనపు ఆర్థిక సహాయం అందిస్తునట్టు తెలిపారు. ప్రత్తిపాడు వెలుగు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గస్థాయి గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను 58 రోజులు లోగా పూర్తిచేసేలా హౌసింగ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ సిబ్బంది అలసత్వం వహించకుండా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, పెద్దాపురం హౌసింగ్ ఈఈ కేవీఆర్ గుప్తా, డీఈ బి.సువర్ణరాజు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల హౌసింగ్ ఏఈలు ఆనంద్, మణికంఠ, శివశ్రీ, వీరబాబు, ఏలేశ్వరం అర్బన్ ఏఈ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాతి బుజ్జి బుధవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో క్షేత్రస్థాయిలో ఉపాధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన ఆర్థిక సంవత్సరంలో మండలంలో 986 కుటుంబాలకు వంద రోజులు పని కల్పించామన్నారు. కూలీలకు పనిదినాలు కల్పించడం, పనులు సకాలంలో పూర్తి చేయుట తదితర అంశాలలో గండేపల్లి మండలం జిల్లాలో రెండవ స్థానంలో నిలిచిందన్నారు. సిబ్బంది మరింత చొరవతో పనిచేసి మండలాన్ని ప్రథమ స్థానంలోకి తీసుకురావలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ఎం.కృష్ణంరాజు, ఈసీ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.